76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL14598 స్థాపితం : 2015

Dr. DWIBHASHYAM KASI VISHWANATH TEJASWI
ఏపీలో ప్రఖ్యాతిగాంచిన చింతలూరు ఆయుర్వేద వైద్యులు,
సంతానరాహిత్య సమస్యలకు
సంప్రదించండి
ph : 90329 90138, 93939 90138
email :dr.d.vishwanath@gmail.com
AYYAPPA AYURVEDIC SYNDICATE
Visakhapatnam

# రాజధాని వార్తలు

Voice of Voiceless

రాజధాని వార్తలు పత్రికలో
ప్రకటన కొరకు సంప్రదించండి
వై.రాజశేఖర్
ఫోన్ : 98480 89624
మంగళగిరి, గుంటూరు,
విజయవాడ

అమరావతి 8-4-2019 సోమవారం సంపుటి : 1 సంచిక 86 రాజధాని వార్తలు తెలుగు దిన పత్రిక పేజీలు 4, వెల: రూ. 2.00

వివరాలు2లో...

ఖర్చు చూస్తే కళ్లు బైర్లు!

వివరాలు2లో...

దేవాన్నే కాదు.. అందరూ మనవళ్లే

వివరాలు3లో...

పెరిగిన ఉష్ణోగ్రతలు కానరాని చలివేంద్రాలు..

వివరాలు4లో...

నువ్వా .. నేనా!

## ఆర్కే ని తక్కువ అంచనా వేసిన తెలుగు దేశం

- బాబు నిర్ణయం బూమ్ రాంగ్ కానున్నదా !?
- టఫ్ ఫైట్ ను ఎదుర్కొంటున్న చినబాబు

**రాజధాని వార్తలు, మంగళగిరి :** మంగళగిరి నియోజకవర్గంలో నెలకొన్న పోటీ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ ఉత్కంఠ రేపుతోంది. ఈ మేరకు జాతీయ మీడియా ప్రతినిధులు మంగళగిరిలో హల్ చల్ చేస్తున్నారు.

వాస్తవానికి గత కొన్ని నెలలుగా మంగళగిరి నియోజకవర్గంలో వైయస్సార్ పార్టీ ఊహించు కున్నంత బలంగా ఏమీ లేదు. ఇక్కడి సీటు బీసీ లకు ఇస్తారని, ఆర్కే వద్ద న్నాడనీ ఇలా పలు ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తెలుగు దేశం పార్టీ కూడా ఈ పరిణామాలను నిశితంగా గమనించి ఏకంగా నారా లోకేష్ నే రంగంలోకి దించింది.

చేనేత వర్గానికి రెండు ప్రధాన పార్టీలు "చెయ్యి " ఇవ్వడంతో ఇక్కడి రాజకీయ చిత్రం ఆసక్తి కరంగా మారింది. రాష్ట్ర స్థాయిలో ఢీకొంటున్న రెండు అగ్ర కులాల ప్రతినిధులే ఇక్కడ తలపడుతు న్నారు.



దీంతో ఎస్సీ, బీసీ వర్గాల ఓట్లు పై చర్చ జరుగుతోంది. ఈ నియోజక వర్గం పై చంద్రబాబు, జగన్ దృష్టి సారించి పావులు చదువుతున్నారు. **ఈనెల తొమ్మిదో తేదీన ముఖ్య మంత్రి ఇక్కడ ప్రచారానికి వస్తున్నారు. ఆ సభానంతరం రాజకీయం మరింత వేడెక్కే అవకాశం ఉంది. ఇప్పటికే వైయస్సార్ పార్టీ తరుపున షర్మిల వచ్చి వెళ్లారు. జగన్ కూడా వస్తారని సమాచారం ఉంది.**

కీలకమైన బడుగు బలహీన వర్గాల ఓటర్ల నిర్ణయమే ఇక్కడి విజేతను ఎంపిక చేయనున్నది. ఈ వర్గాల మధ్య పట్టు సాధించిన ఆర్కే ధీమా గా ఉన్నారు. అయితే అపర రాజకీయ చాణక్యుడి గా పేరొందిన చంద్రబాబు సొంత బిడ్డ విషయంలో తప్పటడుగు వేయడన్న వాదన కూడా ఉంది. ఏదో మాస్టర్ ప్లాన్ తో లోకేష్ ను గెలిపిస్తాడని ఇక్కడి తెలుగు దేశం పార్టీ నాయకులు ఆశతో ఉన్నారు.

ఇదిలా ఉంటే వైయస్సార్సీపీ తమ పార్టీ విజయం ఖాయమంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే గా ఆర్ కె కి ఉన్న మైనస్ లు లోకేష్ రాకతో మటుమాయం అయ్యాయన్న ధీమా తో ఉన్నారు. చేనేత అభ్యర్థి ఆర్కేకి ప్రత్యర్థి అయినట్లయతే పరిస్థితి కష్టంగా ఉండేదని వైసిపి భావిస్తోంది. ఈ భీకరమైన పోరాటంలో విజేతను నిర్ణయించేందుకు ఓటర్లు కూడా కసరత్తు చేస్తున్నారు.

## రైతుల రక్తాన్ని పీల్చుతున్నాయి : జగన్

**రాజధాని వార్తలు, అనకాపల్లి :** ఏపీ ప్రతిపక్ష నేత, వైసీపీ అధినేత జగన్ అనకాపల్లిలో ఎన్నికల రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన ప్రసంగం ఆరంభం నుంచి విమర్శల దాడి మొదలుపెట్టారు. ఆయన ఎక్కువగా స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ముఖ్యంగాద విశాఖ డెయిరీ అంశాన్ని ఎత్తి చూపారు. విశాఖ డెయిరీ పెద్దలు రైతుల సంక్షేమం కోసం అని చెప్పి ఒక ట్రస్టు, ఒక స్కూలు ఏర్పాటు చేస్తారని, కానీ ఆ స్కూలును నారాయణ యాజమాన్యానికి అప్పగించేస్తారని జగన్ ఆరోపించారు. రైతుల ఆరోగ్యం కోసం అంటూ ఆసుపత్రి కడతారని, కానీ ఆ ఆసుపత్రిని కిమ్స్ కు అప్పగించేస్తారని అన్నారు.

- విశాఖ డెయిరీ యాజమాన్యంపై విరుచుకుపడిన వైసీపీ అధినేత
- రైతుల సంక్షేమం పేరుతో అయినవాళ్లకు దోచిపెడుతున్నారు
- ప్రచారంలో స్థానిక సమస్యలపైనే దృష్టి

విశాఖ డెయిరీ ఓ కుటుంబానికి సంబంధించిన సంస్థలా ఉంది తప్ప రైతుల కోసం ఏర్పాటైన సంస్థలా లేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడితో కలిసి ఓవైపు నుంచి హెరిటేజ్ డెయిరీ, మరోవైపు నుంచి విశాఖ డెయిరీ రైతుల రక్తాన్ని పీల్చుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సహకార రంగంలో ఉండే డెయిరీలు రైతులకు మేలు చేస్తాయని భావిస్తారని, కానీ, ఇక్కడ కోఆపరేటివ్ డెయిరీలను నాశనం చేశారని ఆరోపించారు. చంద్రబాబు తన



మాటలు వినే నాయకులను డెయిరీ చైర్మన్లుగా చేస్తారని, తద్వారా లీటర్ మినరల్ వాటర్ కొన్నా రూ. 22, లీటర్ పాలు కొన్నా రూ. 23 అయ్యే పరిస్థితుల్లోకి రైతులను తీసుకెళుతున్నారంటూ నిప్పులు చెరిగారు.




# పవన్‌తోనే మార్పు : రెహ్మాన్

**రెండు కులపార్టీల మధ్య నలిగిపోతున్న ప్రజలకు పవన్ ప్రారంభించిన జనసేన పార్టీ ఆశాదీపంలా మారింది. సమస్యలపై సమరభేరి మ్రోగించిన పవన్‌కు రాష్ట్ర ప్రజలు జేజేలు పలుకుతున్నారు.జనసైన్యాధిపతి ప్రభుత్వం ఏర్పడితే ఎలా ఉంటుందో గుంటూరు (తూర్పు) నియోజక వర్గ జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న జియా ఉర్ రెహ్మాన్ మాటల్లో తెలుసుకుందాం...**

**రాజధాని వార్తలు,గుంటూరు :** గుంతల మయంగా మారిన గుంటూరు వాసులను రోడ్లు, డ్రైనేజ్ సమస్య పీడిస్తోందని అధికారం చేజిక్కించుకునే పార్టీలు మారినా, సమస్యలు మాత్రం ఎక్కడి వక్కడే ఉన్నాయని తూర్పు గుంటూరు జనసేన అభ్యర్థి జియా ఉర్ రెహ్మాన్ విమర్శించారు. మరీ ముఖ్యంగా నగరంలోని ఆటోనగర్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, జనసేనను గెలిపిస్తే దీన్ని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. గుంటూరు 20 ఏళ్ల నుంచి ఎటు వంటి అభివృద్ధికి నోచుకోలేదని, జనసేన నగర అభివృద్ధికి పథకం రచించిందన్నారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ పార్టీలు ప్రజలను పట్టించుకోలేదన్నారు. గత ఎన్నికల్లో టీడీపీకి మద్దతిచ్చిన పవన్ కల్యాణ్ ఈ ఎన్నికల్లో స్వతంత్రంగా ఎందుకు పోటీ చేస్తోందన్న ప్రశ్నకు స్పందిస్తూ, కొత్త రాష్ట్రం అనేక ఒడిదుడుకులు ఎదుర్కోవలసి వస్తుందని, అందువల్ల కేంద్రంలోని బీజేపీకి, రాష్ట్రంలోని టీడీపీకి మద్దతు ఇచ్చారన్నారు. విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన


రెహ్మాన్ తల్లి ఖుర్ ఆన్ పఠిస్తుండగా ఆలకిస్తున్న పవన్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, మైనార్టీలు, బీసీ, ఎస్టీ, ఎస్సీలపై ఉదాసీనత ప్రదర్శించడంతో ఎన్నికల బరిలోకి దిగాల్సి వచ్చిందన్నారు. మైనార్టీలకు జనసేన పెద్ద పీట వేసిందని, సచార్ కమిటీ నివేదికను అమలు చేసి, మైనార్టీల్లోని అవిద్య, ఆర్థిక వెనుకుబాటును పారదోలతామన్నారు. పవన్ నాయకత్వంలోని జనసేన మైనార్టీలకు నాలుగు ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లు ఇచ్చిందని, రాష్ట్రంలోని ఏ ఇతరపార్టీలు ముస్లింలకు ఇంత ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం ముస్లింలను పూర్తిగా విస్మరించిందని, కేవలం ఎన్నికలకు ఆరు నెలలు ఉండగా, మైనార్టీ అభ్యర్థికి మంత్రి పదవి కేటాయించిందన్నారు. జనసేన కుల, మతాలకు అతీతంగా రాజకీయాలు నడుపుతుందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే జనసేన లక్ష్యంగా తెలిపారు. తమ పార్టీ ధనరాజకీయాలకు ఆమడ దూరంలో ఉందని, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులకు ఎన్నికల్లో టికెట్లు కేటాయించలేదన్నారు. జనసేన సైనికులు స్వచ్ఛందంగా లక్షలాది మంది కదలి వస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నవారు కూడా పవన్‌పై అభిమానంతో వాటిని వదిలి పార్టీ ప్రచారం చేస్తున్నారని రహ్మాన్ వారిని అభినందించారు. రాజకీయాల్లో ప్రవేశంపై


రహ్మాన్ ఇంటిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పవన్ కల్యాణ్ భోజనం చేస్తున్న దృశ్యం


మీడియాతో మాట్లాడుతున్నా రహ్మాన్

ఆయన స్పందిస్తూ, 10 ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాల్లో ఉన్నానని, అయితే రాష్ట్ర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, పవన్ అభిమానిగా రాజకీయాల్లోకి వచ్చానన్నారు. జనసేన మేనిఫెస్టో చాలా సింపుల్‌గా పేద, మధ్యతరగతి వారికి అనుకూలంగా ఉంటుందని, అనువుకాని హామీలను ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. సంక్షేమ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం ఇస్తున్న రేషన్ కాకుండా నెలకు రూ. 2,500 నుంచి రూ3.500 లను నేరుగా కుటుంబంలోని మహిళ పేరులో బ్యాంకు అకౌంట్‌లో వేస్తామన్నారు. దీంతో కుటుంబం అంతటికీ కావాల్సిన నిత్యావసర సరుకులు తెచ్చుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. పవన్ కల్యాణ్ స్వయంగా ఫోన్ చేసి తనను అభ్యర్థిగా ప్రకటించారని , అంతకు ముందు జరిగిన ఇంటర్వ్యూలో ఎమ్మెల్యేగా ఎన్నికైతే ప్రజలకు ఏమి చేస్తావని ప్రశ్నించగా, పేదరికం లేని సమాజం కోసం పాటుపడతానని చెప్పానన్నారు. అందులో భాగంగా గుంటూరులో రూ100 కోట్లతో అపార్టుమెంట్లు నిర్మించి పేదలకు ఇస్తామన్నారు. అంతేకాకుండా కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య,వైద్యం ప్రవేశ పెడతామన్నారు. ధనరాజకీయలకు స్వస్తి పలకాలని, లౌకికతత్వాన్ని పెంపొందించాలనే ఉద్దేశ్యంతోనే మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ, ఉభయ కమ్యూనిస్టులతో పొత్తుపెట్టుకున్నామన్నారు. గుంటూరు లోని ఎస్సీ, ఎస్టీ కాలనీలు మురుగునీటితో అపరిశుభ్రవాతావరణంలో ఉన్నాయని, తమ పార్టీ విజయం సాధిస్తే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని పరిశుభ్రతను పెంపొందిస్తామన్నారు.

సమస్యలు వస్తే ఇప్పటిలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా ఒక్క ఫోన్‌కాలుతో పరిష్కరిస్తామని రెహ్మాన్ హామీ ఇచ్చారు. నగరంలో అతిముఖ్యమైన సమస్య నిరుద్యోగ యువతదేనని , ఇందుకోసం గుంటూరులో ఆటోమొబైల్ ఇంజనీరింగ్ కాలేజ్‌ను స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. నీచరాజకీయాలను తరిమికొట్టి పేదలకోసం కృషి చేసే ఏకైకపార్టీ జనసేనే అని ఆయన వెల్లడిస్తూ..పాలన మారాలంటే పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేనకు ఓట్లు వేయాలని ప్రజలను కోరారు.

## వైఎస్సార్‌సీపీతోనే దళిత క్రైస్తవుల అభివృద్ధి

- అందరికి అందుబాటులో ఉండే ఆర్కేను గెలిపించాలి
- మంగళగిరి నియోజకవర్గ పాస్టర్ల అసోషియేషన్ పిలుపు


ఎమ్మెల్యే ఆర్కేను ఆశీర్వదిస్తూ ప్రార్ధనలు చేస్తున్న పాస్టర్లు

**రాజధాని వార్తలు, మంగళగిరి :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే దళితక్రైస్తవుల అభివృద్ధి జరుగుతుందని రానున్న ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి వారంతా కృషి చేయాలని మంగళగిరి నియోజకవర్గ పాస్టర్స్ అసోషియేషన్ పాస్టర్లు పిలుపునిచ్చారు. పట్టణంలోని టిప్పర్ల బజార్లో కల అంజుమన్ వేదికలో నియోజకవర్గ పాస్టర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే) మాట్లాడుతూ సమాజంలోని అంతా సమానులేనన్నారు. అశ్పృశ్యతకు చోటు లేని విధంగా సమాజం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్లాస్టర్లు మాట్లాడుతూ నీతి నిజాయితీ కలిగిన రాజకీయనాయకుడు ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే)ను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో దళిత క్రైస్తవులు అభివృద్ధి

- మిగతా 2 లో

# ఖర్చు చూస్తే కళ్లు బైర్లు!



**రాజధాని వార్తలు, విశాఖపట్నం :** ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులకు ఖర్చు చూసి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. అయితే అంత భారీగా వెచ్చిస్తే తప్ప ప్రచారం ముందుకు సాగడం లేదు. అన్ని పార్టీల వారు చేతికి ఎముక లేకుండా ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన వ్యయ పరిమితి ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.28 లక్షలు కాగా ఎంపీ అభ్యర్థికి రూ.70 లక్షలు. దీనికి, అభ్యర్థులు చేస్తున్న ఖర్చుకు పొంతన లేదు. నువ్వా? నేనా? అనే పోటీ జరుగుతున్న నియోజకవర్గాల్లో అయితే ఒక్క రోజుకే రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చు పెడుతున్నారు. డబ్బులు మంచినీళ్లలా ఖర్చు అవుతున్నాయని అభ్యర్థుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి రూ.5 కోట్లకు తక్కువ లేకుండా ప్రచారానికి కేటాయించారు. ఇది కాకుండా ఓట్లకు మళ్లీ చెల్లింపులు వేరేగా ఉంటాయని, ఆ ఖర్చు వేరే అని పలువురు చెబుతున్నారు.

**కిరాయి మనుషులతోనే ప్రచారం**

ప్రధాన పార్టీ అభ్యర్థులు కూడా ప్రచారం కోసం కిరాయి మనుషులను పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వ్యాపారమే పెద్దఎత్తున నడుస్తోంది. ప్రచారానికి మనుషులను సరఫరా చేసే దళారులకు గిరాకీ పెరిగింది. పార్టీ సాధారణ కార్యకర్తలకు కూడా రోజుకు రూ.100 నుంచి రూ.250 ఇవ్వాల్సి వస్తోంది. వార్డుల వారీగా ప్రచారం కోసం పార్టీ వార్డు అధ్యక్షునికి కొందరు రోజుకు రూ.50 వేలు ఇస్తున్నారు. వంద మందికి తక్కువ లేకుండా మనుషులను పెట్టుకొని వార్డులో ప్రచారం చేయాలి. అలా వచ్చిన వారికి రోజుకు రూ.100 నుంచి రూ.250 వరకు ఇస్తున్నారు. నగరంలోని ఒక్కో నియోజకవర్గంలో 10 నుంచి 15 వరకు వార్డులు ఉన్నాయి. ఇలా ప్రతి వార్డుకు 50 వేలు చొప్పున రోజుకు రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షలు ఉదయాన్నే పంపిణీ చేస్తున్నారు.

**కేటరింగ్‌కు రూ.30 వేలు నుంచి రూ.40 వేలు**

ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనాలు, రాత్రి మద్యం వంటి వ్యయాన్ని పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యాలయమే చూసుకుంటోంది. టిఫిన్‌కు రూ.50, భోజనానికి (నాన్‌వెజ్) రూ.150, రాత్రి బిర్యానీకి రూ.100 చొప్పున ఎంతమంది తింటే అంతమందికి చెల్లిస్తున్నారు. ఈ భోజనాల బాధ్యత కేటరింగ్‌కు కాంట్రాక్టు ఇచ్చేశారు. ఒక్కో నియోజకవర్గంలో రోజుకు వేయి మంది సగటును భోజనాలు చేస్తున్నారు. కేటరింగ్‌కు రోజుకు రూ.30 వేలు నుంచి రూ.40 వేలు అవుతోంది. మద్యం తాగేవారికి టోకెన్లు ఇచ్చేస్తున్నారు. వాటిని పట్టుకొని వెళితే కావలసింది అక్కడ ఇచ్చేస్తున్నారు. ఇలా రోజుకు రూ.50 వేల వ్యయం లెక్క తేలుతోంది.

**ర్యాలీ వ్యయం ప్రత్యేకం**

ప్రతి రోజూ ఎమ్మెల్యే అభ్యర్థి భారీ ర్యాలీతో నియోజకవర్గంలో ప్రచారానికి వెళుతున్నారు. ఈ ర్యాలీలో పాల్గొనేవారికి రూ.250 చొప్పున ఇస్తున్నారు. కనీసం 500 మందికి తక్కువ లేకుండా జనసమీకరణ చేస్తున్నారు. డప్పులు, వాయిద్యాలు, పులివేషాల ప్రదర్శనకు రోజుకు రూ.50 వేలు ఇస్తున్నారు. ర్యాలీలో బైకులతో ఎవరైనా పాల్గొంటే వారికి లీటరు చొప్పున పెట్రోల్ పోయిస్తున్నారు. దీనికి రూ.10 వేలు వరకు వెచ్చిస్తున్నారు. ఇతర ఖర్చులన్నీ కలిపి ర్యాలీకి రోజుకు రూ.3 లక్షలు పెడుతున్నారు.

**హారతులకే రూ.20 వేలు**

కొందరు అభ్యర్థులు వార్డుల్లో రాత్రిపూట ప్రచారానికి వెళుతుంటే...మహిళలు హారతులు పట్టి ఆహ్వానిస్తున్నారు. ఆడపడుచు హారతి ఇచ్చిందనే సంతోషంతో కొందరు అభ్యర్థులు రూ.500 నోటు సంతోషంగా వేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు హారతులు ఇస్తుండడంతో అందరికీ రూ.500 చొప్పున ఇవ్వాల్సివస్తోంది. ఈ నోట్లు హారతి పళ్లెంలో వేయడానికి ప్రత్యేకంగా ఓ మనిషిని అభ్యర్థి పక్కనే పెట్టుకుంటున్నారు. రోజుకు రూ.20 వేలు వరకు ఈ హారతులకే అయిపోతోంది.

**ఇదీ రోజువారీ వ్యయం**

- ఒక నియోజకవర్గంలో 10 వార్డులు ఉన్నాయనుకుంటే... వార్డుకు రూ.50 వేలు చొప్పున రూ.5 లక్షలు.
- కార్యకర్తల భోజనాలకు రూ.50 వేలు
- పార్టీ కార్యాలయాల నిర్వహణ, మైక్‌సెట్లకు రూ.50 వేలు
- కార్యకర్తల మద్యం వ్యయం రూ.50 వేలు
- రోజుకొక ర్యాలీ వ్యయం రూ.3 లక్షలు.
- హారతులకు రూ.20 వేలు
- పెట్రోల్ ఇతరత్రా వ్యయాలు రూ.30 వేలు
- మొత్తం రోజుకు రూ.10 లక్షలు

అదే వార్డుల సంఖ్య పెరిగితే వ్యయం పెరుగుతుంది.

**రూరల్‌లో కూడా రూ.10 లక్షలు**

గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యయం మరో విధంగా ఉంటోంది. ఒక్కో మండలానికి రోజుకు రూ.2 లక్షలు ఇచ్చి ప్రచారం బాధ్యతలు అప్పగిస్తున్నారు. నియోజకవర్గానికి నాలుగు మండలాలకు తక్కువ లేకుండా ఉన్నాయి. వాటికే రూ.8 లక్షలు ఇస్తున్నారు. ఇక ఎమ్మెల్యే ప్రచారానికి రూ.2 లక్షలు. ఆ లెక్కన అక్కడ కూడా రోజుకు రూ.10 లక్షలు తక్కువ కాకుండా వెచ్చిస్తున్నారు.

## రాజధాని వార్తలు కలం

### అద్వానీ పరితాపం

మనం ఏ విత్తనం వేస్తే అదే పంటను కోస్తాం. పిల్లలకు ఏం నేర్పితే అదే వంటబట్టించుకుంటారు. కాల భ్రమణంలో మనం చేసిందే మనకు చుట్టుకుంటుంది. తాత్కాలిక ప్రయోజనాల కోసం దేశంలోని లౌకిక వాదానికి గండికొట్టి, సుభిక్షమైన దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రథ యాత్ర చేపట్టి బీజేపీని ఉనికిలోకి తీసుకువచ్చిన కురువృద్ధుడు లాల్ కృష్ణ అద్వానీ (91) ఇప్పుడు తీరిగ్గా పరితాపం చెందుతున్నారు. ఎందుకంటే 1990 సెప్టెంబర్‌లో ఆయన ప్రారంభించిన రథయాత్ర ఆపై జరిగిన బాబ్రీ విధ్వంసం ప్రజలు మరిచిపోలేదు. ఆ రథయాత్రలో ఆయనకు అనేక సేవలు చేసిన నరేంద్ర మోదీ ఆతర్వాత గుజరాత్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. అద్వానీ, మరళీమనోహర్ జోషి నూరిపోసిన మతతత్వానికి గుజరాత్‌లో దారుణ మారణ కాండ జరిగింది. దీనిలో 2000 మంది మైనార్టీలు హత్యలకు గురయ్యారు. ఒక ముఖ్యమంత్రి కుల,మత విద్వేషానికి అంతమంది హతం కావడం ప్రపంచాన్ని నివ్వెర పరిచింది. అమెరికా మోడీ వీసాను తిరస్కరించింది. భూగోళంలోని అత్యంత క్రూరుడిగా ఆయనకు మొదటి స్థానం వచ్చింది. అయినా తర్వాతి కాలంలో ఆయనే ప్రధానిగా ఎదిగేందుకు పరిస్థితులు దోహదపడ్డాయి. అందుకు ప్రధాన జాతీయ పార్టీ కాంగ్రెస్‌కూడా కారణమే..కాంగ్రెస్ స్కామ్‌లతో నిండిపోవడం,వామపక్షాలు సిద్ధాంతాల పేరుతో చీలికలు పీలికలై పోవడంతో ప్రజలు మరో ప్రత్యామ్నాయం లేక ఆపార్టీని గెలిపించాల్సిన అగత్యం ఏర్పడింది. అదే సమయంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, 100 రోజుల్లో విదేశాల్లోని నల్లడబ్బు సామాన్య ప్రజల ఖాతాలో వేస్తాం. రైతులకు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తాం.. మేక్ ఇన్ ఇండియా అనగానే మోడీకి భారీ ఓట్లు పడ్డాయి. వాస్తవానికి ప్రధాని అభ్యర్థిగా అద్వానీని ప్రకటించాల్సి ఉంది. వాజ్‌పేయి సమయంలో ఆయన లౌకికవాది కాదని ఆ పదవికి అనర్హుడిగా ప్రకటించగా, 2014 నాటికి ఆయనకంటే కరడు గట్టిన మతోన్మాదిగా రూపొందిన మోడీ వైపు ఆర్ఎస్ఎస్ మొగ్గడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఏమైతేనేం ప్రధాని పదవి అద్వానీకి అది అందని ద్రాక్షగా మిగిలిపోయింది. పోనీ రాష్ట్రపతిగా అయినా నియామకం చేస్తారంటే ఆ సమయానికి ఆయనపై కేసులు బయటికి తీశారు ప్రధాని. మోడీ ప్రధాని కావడం .. అద్వానీ గ్రాఫ్ పడిపోవడం ఒకేసారి జరిగాయి. బీజేపీ సీనియర్ నేతగా ఆయన గుర్తింపు, గౌరవానికి నోచుకోలేదు. కించిత్ గౌరవాభిమానాలు ప్రదర్శించకుండా 75 ఏళ్లు నిండిన వారికి ప్రజాప్రతినిధులుగా పోటీ చేసే అవకాశం లేదంటూ నిర్థాక్షిణ్యంగా ఆయనకు టికెట్ నిరాకరించారు. వాస్తవానికి ఆయన గౌరవార్థం ఒక కార్యక్రమం నిర్వహించి అద్వానీ పార్టీకి చేసిన సేవలను స్మరించుకొని ఆయనకు విశ్రాంతి ఇస్తున్నామంటే ఆయన కూడా సంతోషపడి ఉండేవారేమో..

1991 నుంచి ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించిన గాంధీనగర్‌ను అద్వానీ నుంచి గుంజుకొని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆస్థానం నుంచి పోటీచేస్తున్నారు. దీనిపై రెండు రోజుల క్రితం అద్వానీ స్పందించారు. ఈనెల 6న పార్టీ ఆవిర్భావ దినోత్సవం కూడా కావడంతో ఆయన బ్లాక్‌లో భారీ లేఖను ఉంచారు.'బీజేపీని వ్యతిరేకించే వారు దేశద్రోహులుగా భావించే సంస్కృతి పార్టీకి లేదు' అని 'రాజకీయంగా వ్యతిరేకించే వారు శత్రువులు కాదని, కేవలం ప్రత్యర్థులు' మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో పాటు 'భిన్నత్వాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవించడమే భారతీయ ప్రజాస్వామ్యానికి మూలం' అని అన్నారు. భారతదేశ స్వతంత్రతను, సమగ్రతను, వ్యవస్థలను, మీడియాను కాపాడడం బీజేపీ బాధ్యత అని చెప్పారు. బీజేపీ అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్న వేళ ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే లౌకికత్వాన్ని మంటగలిపి, గుజరాత్ అల్లర్లలో మోడీకి మద్దతు ఇచ్చిన అద్వానీ ఇప్పుడు వగచి మాత్రం ఉపయోగం ఏముంది ?

## వైఎస్సార్‌సీపీతోనే దళిత క్రైస్తవుల అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)



జామియా మసీదు వద్ద ముస్లిం సోదరులతో ఎమ్మెల్యే ఆర్కే

చెందాలంటే వైఎస్సార్ సీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అదే విధంగా గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి మోదుగుల వేణుగోపాలరెడ్డి, మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే)ల గెలుపుకు దళితక్రైస్తవులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఎమ్మెల్యే ఆర్కేను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మంగళగిరి పాస్టర్స్ ఫెల్లోషిప్ నుంచి పి తిమోతి, ఏవీఎస్ మణి, క్యాప్టల్ రీజయన్ పాస్టర్స్ ఫెల్లోషిప్ నుంచి బి రవిప్రకాష్, ఎం భాస్కరరావు, దుగ్గిరాల ఫాస్టర్స్ పెల్లోషిప్ నుంచి సురేష్ కుమార్, బుజ్జిబాబు, తాడేపల్లి ఫాస్టర్స్ పెల్లోషిప్ నుంచి ఎం ఆనందరావు, ఎం జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. ముస్లిం సోదరులను కలిసిన ఎమ్మెల్యే ఆర్కే పట్టణంలోని జామియా మసీదు వద్ద ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే) పలువురు ముస్లిం సోదరులను కలిశారు. పెద్ద ఎత్తున హాజరైన ముస్లిం యువకులు ఆర్కేతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. పలువురు ముస్లిం పెద్దలను ఆర్కే మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మైనార్టీ నాయకులు నృసిముల్లా, ఎంపిటిసి హన్నన్. మాబు, షేక్ అక్రమ్‌జ మహ్మద్ ఫిరోజ్, ఆలీబాషా తదితరులున్నారు.

**బాబూ జగజ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు**

డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్ 112 వజయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ సెంటర్‌లో కల బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి (ఆర్కే) పూలమాలలు వేసి ఘనంగా నివాలులర్పించారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ దలితు అభ్యున్నతి కొరకు నిరంతరం పోరాడిన యోధుడు జగజ్జీవన్‌రామ్ అన్నారు. దేశచరిత్రో జగజ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అధికారప్రతినిధి పచ్చల శ్యాంబాబు, దలితనాయకులు మల్లవరపు నాగయ్య. కారుమంచి రామరావు. ఇందుపల్లి రామారావు.గుంటూరు ఎలీషా. జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 'పసుపు-కుంకుమ' డబ్బులు పాత బాకీలకు జమ

**బీజేపీ నేత ఐవైఆర్**



**రాజధాని వార్తలు, అమరావతి :** ఏపీ ప్రభుత్వం 'పసుపు-కుంకుమ' పథకం అందజేస్తున్న నగదును బ్యాంకర్లు పాత బకాయిలకు జమ చేసుకుంటున్నారని ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, బీజేపీ నేత ఐవైఆర్ కృష్ణారావు తెలిపారు. మనం ఒకటి తలిస్తే బ్యాంకరు మరొకటి తలంచడం అంటే ఇదేనని వ్యాఖ్యానించారు. ఇదంతా సాధారణ బ్యాంకింగ్ ప్రక్రియలో భాగమేనని వ్యాఖ్యానించారు. దీంతో ఈ నిధుల జమ వల్ల చంద్రబాబుకు ఫలితం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో రేపటి నుంచి చంద్రబాబు బ్యాంకు అధికారులను కూడా తిట్టడం ప్రారంభిస్తారేమో? అని అనుమానం వ్యక్తం చేశారు. ఈరోజు ట్విట్టర్ లో ఐవైఆర్ స్పందిస్తూ..'మనం ఒకటి తలిస్తే బ్యాంకరు ఒకటి తలుస్తాడు. పసుపు కుంకుమ డబ్బులు పాత బాకీలకు జమ అవుతున్నాయట. అది సాధారణ బ్యాంకింగ్ ప్రక్రియ. ఇంత శ్రమపడి ముఖ్యమంత్రి గారి మాటల్లోనే ఐటీ రైడులు జరుగుతున్నాయి కాబట్టి ప్రభుత్వ పథకాల ధనం జమ చేస్తున్నాను అన్న నిధుల తరలింపు ఆశించిన ఫలితం ఇవ్వకపోవచ్చు.మరి రేపటి నుంచి ముఖ్యమంత్రి గారు బ్యాంకు అధికారులను తిట్టడం ప్రారంభిస్తారు ఏమో' అని ట్వీట్ చేశారు.

## లోకేష్‌కు మద్దతుగా బ్రహ్మణి ప్రచారం



**రాజధాని వార్తలు, అమరావతి :** మంగళగిరి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి, మంత్రి లోకేష్‌కి మద్దతుగా ఆయన సతీమణి బ్రహ్మణి ప్రచారం చేయనున్నారు. మంగళగిరి నియోజవర్గంలోని కేఆర్ కొండూరు, పెనుమూలి, చింతలపూడిలో బ్రాహ్మణి ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఇందులో భాగంగా దుగ్గిరాల మండలం కేఆర్ కొండూరులో మహంకాళి అమ్మవారికి బ్రాహ్మిణి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతం అక్కడి నుంచి లోకేష్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

## దేవాన్షే కాదు.. అందరూ మనవళ్లే

- అందుకే వారి చదువుకు ఏడాదికి రూ.18వేలు
- నందిగామ ఎన్నికల ప్రచారసభలో చంద్రబాబు



**రాజధాని వార్తలు, నందిగామ :** "మీ పిల్లల్ని బడికి పంపించండి. వారిని ఇంజినీర్లు, డాక్టర్లను చేసే బాధ్యత నాది. వారి చదువుకు ఏడాదికి రూ.18వేలు ఇస్తున్నా. నాకు దేవాన్ష్ ఒక్కడే కాదు. రాష్ట్రంలో ఉన్న చిన్నారులంతా మనవలు, మనవరాళ్లే" అని తెదేపా జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు అన్నారు. కృష్ణా జిల్లా నందిగామలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. కోడలు నారా బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ కూడా ఈ బహిరంగ సభకు హాజరయ్యారు. తెదేపా జెండాతో దేవాన్ష్ వేదికపై సందడి చేశాడు. తాను రోజూ బయటకు వెళుతుంటే.. ఎక్కడికి అని దేవాన్ష్ అడిగేవాడని, తన కష్టం తెలియాలనే ఉద్దేశంతోనే ఇక్కడికి తీసుకొచ్చానని చంద్రబాబు చెప్పారు.

**ఎవరైనా ఎంబీఏ చేసి బీకాం చదువుతారా?**

"వృద్ధులకు, పేదలకు అండగా ఉంటానని హామీ ఇచ్చా. పింఛన్లు ఐదు రెట్లు పెంచా. త్వరలో పింఛను రూ.3వేలు చేస్తా. పోలవరం పూర్తయితే కృష్ణా జిల్లాకు నీటి కొరత ఉండదు. రాజధాని వల్ల కృష్ణా జిల్లాలో భూముల విలువ పెరిగింది. రాష్ట్రంలో ఉన్న చిన్నారుల భవిష్యత్ నాది. విదేశాల్లో విద్యనభ్యసించే వారికి రూ.20లక్షలు ఇస్తా. ఇంటర్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్‌లు ఇస్తా. ఇలాంటి ఆలోచనలు కోడికత్తి పార్టీకి రాదు. ఎవరైనా బీకాం చేసి.. ఎంబీఏ చేస్తారు. కానీ జగన్ గతంలో ఎంబీఏ చదివానని చెప్పాడు. ఇప్పుడు బీకాం అంటున్నాడు. నరేంద్రమోదీ అయితే ఏ యూనివర్సిటీలో చదివారో తెలీదు. నేను మాత్రం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ పీహెచ్‌డీ చేశా" అని చంద్రబాబు అన్నారు.

**అందుకే అమరావతిపై కుట్రలు**

"హైదరాబాద్ వంటివి ఆంధ్రాలో 20 చేస్తా. అమరావతి అభివృద్ధి అయితే హైదరాబాద్ ఎత్తిపోతుందని కేసీఆర్ భయపడుతున్నారు. అమరావతిని అణగదొక్కాలని కేసీఆర్ చూస్తున్నారు. జగన్, కేసీఆర్, మోదీ కలిసి కుట్రలు పన్నుతున్నారు. వైకాపా నేతలు డబ్బులు వెదజల్లుతున్నారు. డబ్బుతో ఓటర్లను కొనాలని చూస్తున్నారు. వారి కుట్రలను తిప్పి కొట్టాలి. తెదేపా అభ్యర్థులను గెలిపించాలి" అని చంద్రబాబు ఓటర్లను కోరారు.

## మళ్లీ ఓటు అడుగుతా : వైఎస్ జగన్



**రాజధాని వార్తలు, టెక్కలి (శ్రీకాకుళం) :** మేనిఫెస్టోలోని ప్రతి హామీని నెరవేరుస్తామని, వాటిని అమలు చేసిన తర్వాతే మళ్లీ ఎన్నికల్లో ఓటు అడగుతామని ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో జరిగిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. గత ఎన్నికల ముందు చంద్రబాబు 50 పేజీల మేనిఫెస్టోలో 650 హామీలిచ్చారని, ప్రతి కులానికి ఓ పేజీ కేటాయించి దారుణంగా మోసం చేశారన్నారు. మళ్లీ ఇప్పుడు 34 పేజీలతో మరోసారి మోసం చేయడానికి సిద్ధమయ్యారని, ప్రజలు ఆలోచించాలని కోరారు. తాము నిన్న విడుదల చేసిన మేనిఫెస్టో కేవలం ఒకే పేజని..రెండు వైపులు మాత్రమే ఉందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు.. నవరత్నాల్లో చెప్పిన మాటలు, ప్రతి పేదవాడి గుండె చప్పుడు మేనిఫెస్టోలో పెట్టామని స్పష్టం చేశారు. ఈ మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి రోజు చూపిస్తామని, ఎవరూ మర్చిపోకుండా చేస్తామన్నారు. ప్రతి రోజు ఇది చెప్పాం.. ఇది చేశామని అందరికి చూపిస్తామని తెలిపారు.

ఐదేళ్ల తర్వాత మళ్లీ ఇదే మేనిఫెస్టోతో ప్రజల దగ్గరికి వస్తామని, ఇందులో చెప్పిన ప్రతి మాటను చేశామని. మళ్లీ మమ్మల్ని గెలిపించండని అడుగుతామన్నారు. ఈ చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలని, ప్రతి రాజకీయ నాయకుడు తాను చెప్పిన పనిని చేయకపోతే.. రాజీనామా చేసి ఇంటికి వెళ్లాలని అన్నారు. అప్పుడే రాజకీయాల్లో విశ్వసనీయత వస్తోందని తెలిపారు. ఇది తన ఒక్కడి వల్ల కాదని, ప్రజల సాకారం కావాలని కోరారు. టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాడ తిలక్, శ్రీకాకుళం లోక్‌సభ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌లను ఆదరించి, ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ సభలో ఆయన ఏమన్నారంటే..

**మాటిచ్చాను.. అండగా ఉంటాను..**

'టెక్కలి నియోజకవర్గంలో కూడా నా పాదయాత్ర సాగింది. ఆ పాదయాత్రలో మీరు చెప్పిన ప్రతి మాట, ఆవేదన, బాధలు, కష్టాలు నాకు ఇంకా గుర్తుకున్నాయి. ఈ రోజు మీ అందరికి నేను ఉన్నాననే భరోసా ఇస్తున్నాను. మహేంద్ర తనయ ప్రాజెక్ట్‌కు దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి శ్రీకారం చుట్టి.. రూ.62 కోట్లు కూడా ఖర్చు చేసి 40 శాతం పనులు పూర్తి చేశారు. ఆయన మరణాంతరం ఆ ప్రాజెక్టును ఎవరు పట్టించుకోలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రాజెక్ట్ అంచనాలు పెంచి దోచుకున్నారు. భూనిర్వాసితులను పట్టించుకోలేదు. పవర్‌ప్లాంట్‌ను 51 గ్రామాలు వ్యతిరేకిస్తున్నప్పుడు అధికారంలో రాగానే రద్దు చేస్తానని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత అనుమతులిస్తూ జీవోలు జారీ చేశారు. ఆ 51 గ్రామాల ప్రజలకు చెబుతున్నా.. పాదయాత్రలో మీ అందరికి మాటిచ్చాను.. మీకు తోడుగా ఉంటానని మళ్లీ పునరుద్ఘాటిస్తున్నాను. తీరప్రాంత గ్రామాల్లో మత్స్య కార్మికులకు.. కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మరిచారు. ఆ ప్రతి మత్స్యకారుడికి చెబుతున్నా.. నేను అండగా ఉంటాను.

## అమరావతి తరలిపోనుంది - నటుడు శివాజీ

**రాజధాని వార్తలు, అమరావతి :** ఈ ఎన్నికల్లో మరోసారి ఏపీ రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రాకపోతే రాజధాని నుండి అమరావతి తరలిపోనుందని సినీ నటుడు శివాజీ అభిప్రాయపడ్డారు.

ఒక కులం కోసం అమరావతిలో నిర్మితమయ్యే రాజధానిని ఇతర ప్రాంతానికి తరలించే అవకాశం ఉందని ఆయన ఆరోపణలు చేశారు. ఎవరి కోసం అమరావతిలో జరుగుతున్న రాజధానిని ఇతర ప్రాంతాలకు తరలించాలని చూస్తున్నారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం కోసం 33 వేల ఎకరాలను కట్టబెట్టిన రైతులకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

గతంలో ఓ ఇంటర్వ్యూలో వైసీపీ చీఫ్ వైఎస్ జగన్ అమరావతిలో శాశ్వత భవనాల నిర్మాణం కోసం ఒక్క ఇటుకను కూడ పేర్చలేదని జగన్ చేసిన ఆరోపణలను శివాజీ ప్రస్తావించారు.

అమరావతిలో నిర్మాణాలు సాగుతున్న ప్రాంతంలో ఎక్కడ ఏం చేస్తున్నారనే విషయాలపై శివాజీ వీడియోలను చూపిస్తూ నిర్మాణాల గురించి వివరించారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నివాస గృహాలతో పాటు అధికారుల కోసం తలపెట్టిన నిర్మాణాలను శివాజీ పరిశీలించారు. ఈ విషయాలను ఆయన వీడియోలో వివరించారు.

సెక్రటేరియట్ భవనం నిర్మిస్తున్న విషయాన్ని వాస్తవమేనని శివాజీ చెప్పారు. ఈ నిర్మాణాలు గ్రాఫిక్స్ మాయాజాలం కాదని జగన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలను ఆయన సంధించారు.తాత్కాలిక అసెంబ్లీ, సెక్రటేరియట్ నిర్మాణాలను కూడ శివాజీ ఈ వీడియోలో చూపించారు. వాస్తవాలను అందరూ అంగీకరించాల్సిందేనని ఆయన చెప్పారు.

అమరావతిలో ఏం జరగడం లేదని చెప్పడం ప్రజలను అవమానించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతిలో 8 టవర్ల నిర్మాణం దాదాపుగా పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రజలు సరైన నిర్ణయం తీసుకొంటే రాజధాని నిర్మాణం జరుగుతోందన్నారు. లేకపోతే రాజధాని హైద్రాబాద్‌కు వెళ్తుందా అనే అనుమానాన్ని కూడ ఆయన వ్యక్తం చేశారు.

రాజధాని వార్త పత్రిక కోసం
సంప్రదించండి
ఫోన్ : 7680994755

**వసంత కుటుంబ సభ్యుల ఎన్నికల ప్రచారం...**



**గడప గడపకు వైఎస్సార్ కార్యక్రమంలో భాగంగా...**

**రాజధాని వార్తలు, మైలవరం :** మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాదు సతీమణి శీరిష కుమార్తె భావన సోదరీమణులు రాధారాణి, ఝాన్సీ శుక్రవారం సాయంత్రం నుండి రాత్రి వరకు మైలవరం మండలం వెల్వడం గ్రామంలో గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు గ్రామంలో ప్రతి ఒక్కరిని కలిసి వారితో మాట్లాడి ఒక్క సారి ఆలోచించండి అవకాశం ఇవ్వండి మైలవరం నుండి ఎమ్మెల్యేగా వసంత కృష్ణ ప్రసాదు యంపి గా పొట్లూరి వీరప్రసాదు గెలిపించాలని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలను గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు పెద్ద ఎత్తున మహిళలు ప్రజలు వెంటరాగా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు ఈ కార్యక్రమంలో మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సలహాదారుగా ఉండడానికి నేను రెడీ, కానీ...!: పురందేశ్వరి



**రాజధాని వార్తలు :** బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరి తాజా పరిస్థితులపై స్పందించారు. విశాఖపట్నం బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పురందేశ్వరి తన మేనల్లుడు జూనియర్ ఎన్టీఆర్ గురించి మాట్లాడుతూ, తనకు సినిమాల్లో మంచి భవిష్యత్ ఉందని, ఇప్పట్లో రాజకీయాల్లోకి రాకపోవచ్చని అన్నారు. కానీ రాజకీయాల్లోకి అడుగుపెట్టాలనుకుంటే అతనికి సలహాలు ఇచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పురందేశ్వరి స్పష్టం చేశారు. తనకు సలహాదారుగా ఉండమని ఎన్టీఆర్ స్వయంగా అడగాలని, అంతే తప్ప ఉచిత సలహాలు ఇచ్చే ప్రయత్నం మాత్రం చేయనని పేర్కొన్నారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచనే లేదని గతంలో చాలాసార్లు చెప్పాడని, అందుకే తారక్ రాజకీయ జీవితం గురించి ఇప్పుడే చర్చించాల్సిన అవసరంలేదని భావిస్తున్నట్టు చెప్పారు. అంతేగాకుండా, లక్ష్మీస్ ఎన్టీఆర్ చిత్రంపై స్పందిస్తూ, ఆ సినిమా తాను చూడలేదని వెల్లడించారు. తాను లక్ష్మీపార్వతిని కొట్టినట్టుగా ప్రచారం జరుగుతోందని, అందులో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ప్రజలు సంచలనం కోరుకుంటారు కాబట్టే లక్ష్మీస్ ఎన్టీఆర్ చిత్రంపై ఆసక్తి ఏర్పడిందని అభిప్రాయపడ్డారు.

## జనసేనను టీడీపీకి హోల్ సేల్‌గా అమ్మేశాడు : షర్మిల



**రాజధాని వార్తలు, తూర్పుగోదావరి :** టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌లపై వైసీపీ నేత షర్మిల విమర్శల వర్షం కురిపించారు. కాకినాడలో ఆదివారం నాటి ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. చంద్రబాబు రెండు వేళ్ళు చూపించేది.. తనకు రెండు నాలుకలు ఉన్నాయని చెప్పడం కోసమేనన్నారు. పవన్ కల్యాణ్ తన అన్నను ఆదర్శంగా తీసుకుని.. జనసేనను ఎప్పుడో టీడీపీకి హోల్‌సేల్‌గా అమ్మేశాడని ఆరోపించారు.

## పెరిగిన ఉష్ణోగ్రతలు

# కానరాని చలివేంద్రాలు..

- నిర్మానుష్యంగా రహదారులు..
- ఆగని నీటిదోపిడీ





**రాజధాని వార్తలు, అమరావతి :** ఎన్నికల ప్రచార వేడితోపాటు సూర్య తాపానికి జనం విలవిల్లాడుతున్నారు. కొద్ది రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో సామాన్య జనం తల్లడిల్లిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే రహదారులు నిర్మానుష్యంగా మారటంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి. బాటసారులు, ద్విచక్ర వాహన దారులు, వయోవృద్ధులు అత్యవసర సమయాల్లోనే ఇంటి నుంచి బయటకు రావటానికి మొగ్గు చూపుతున్నారు.

**కనిపించని చలివేంద్రాలు...**

ఎన్నికల ప్రచార హోరులో పడిన ఆయా పార్టీలు చలివేంద్రాల ఏర్పాటు మరిచాయి. ఎండ నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు గతంలో స్వచ్ఛంద సంస్థలు, పంచాయతీ సిబ్బంది చలివేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది ఎండలు ముదిరినప్పటికీ ప్రజల దాహార్తిని తీర్చటానికి స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రాకపోవటం బాధాకరం. పార్టీ కార్యాలయాల వద్ద సైతం తాగునీరు, మజ్జిగ ఇచ్చేవారే కరువయ్యారు.

**శీతల పానీయాలకు గిరాకీ**

వేసవి దప్పికను తీర్చుకోవటానికి జనం శీతల పానీయాల కోసం పరుగులు పెడుతున్నారు. చల్లని ద్రవ పదార్థాలతో శరీరాన్ని చల్లబర్చుకోవటానికి భారీగానే జేబులు గుల్ల చేసుకుంటున్నారు. జనం అవసరాన్ని ఆసరా చేసుకుని దుకాణదారులు ఎంఆర్పీకి మించి విక్రయిస్తున్నారు. కొబ్బరి బొండాం బండ్లు, చెరుకు రసం, పండ్ల రసాల దుకాణాలు జనంతో కిక్కిరిసిపోతున్నాయి.

**ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లపై పర్యవేక్షణ కరవు**

పంచాయతీల ఆధ్వర్యంలో కుళాయిల ద్వారా అందించే నీరు తాగటానికి అనువుగా లేకపోవటంతో ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లలో నీటి దోపిడీ అధికమయ్యింది. స్వచ్ఛంద సంస్థల ముసుగులో ట్రస్టుల పేరుతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నా అధికారుల పర్యవేక్షణ లోపించటంతో ప్లాంట్లలో నీరు దుర్వాసన వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండవల్లి గ్రామంలో అనుమతులు లేకుండా ప్లాంట్లు నడుస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

## జగన్ ఇంటికి వచ్చిన మోత్కుపల్లి..

**రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చలు!**



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** తెలంగాణ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు ఈరోజు వైసీపీ అధినేత జగన్ తో భేటీ అయ్యారు. హైదరాబాద్ లోని లోటస్ పాండ్ లో ఉన్న జగన్ నివాసానికి మోత్కుపల్లి వచ్చారు. ఆయన్ను వైసీపీ నేతలు సాదరంగా లోపలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణలో రాజకీయ పరిస్థితులతో పాటు భవిష్యత్ కార్యాచరణపై జగన్ తో ఆయన సుదీర్ఘంగా చర్చించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆహ్వానిస్తే టీఆర్ఎస్ లో చేరేందుకు సిద్ధమని నిన్న మోత్కుపల్లి ప్రకటించారు. అంతేకాకుండా ఏపీ సీఎం చంద్రబాబుపై కూడా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వ విధానాలను తీవ్రంగా తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో జగన్‌తో ఈరోజు మోత్కుపల్లి భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## 130 సీట్లతో జగనే సీఎం అవుతాడు

**మోహన్ బాబు**



**రాజధాని వార్తలు,విశాఖ :** ఇటీవలే వైసీపీలో చేరిన ప్రముఖ నటుడు మోహన్ బాబు సీఎం చంద్రబాబుపై విమర్శలు గుప్పించారు. విశాఖ జిల్లా అరిలోవలో మోహన్ బాబు వైసీపీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు టీడీపీని స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నాడని మండిపడ్డారు. ఇప్పుడున్నది ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ కాదని ఆయన పునరుద్ఘాటించారు. ఒకప్పుడు తెలుగువారి ఆత్మగౌరవం నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని మోహన్ బాబు పేర్కొన్నారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీకి 130 సీట్లు రావడం ఖాయమని, జగన్ సీఎం కావడం తథ్యమని మోహన్ బాబు ధీమా వ్యక్తం చేశారు. జగన్ కూడా తండ్రి వైఎస్సార్ బాటలోనే సుపరిపాలన అందిస్తారని చెప్పారు.

## పట్టువదలని విక్రమార్కుడు..

- 30 సార్లు పరాజితుడు.. అయినా మళ్లీ పోటీ!
- 31వ సారి బరిలోకి దిగుతున్న శ్యాంబాబు
- పీవీ నరసింహారావు, బిజూ పట్నాయక్‌పైనా పోటీ
- ఈసారి తప్పక గెలుస్తానని ధీమా



**రాజధాని వార్తలు, ఒడిశా :** ఒడిశాకు చెందిన శ్యాంబాబు సుబుధి 1962లో తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేశారు. అప్పటి నుంచి లోక్‌సభ, అసెంబ్లీ ఏ ఎన్నికలు వచ్చినా బరిలో నిలుస్తూనే ఉన్నారు.. ఓడిపోతూనే ఉన్నారు. ఎన్నో పార్టీలు ఆయనకు టికెట్ ఆఫర్ చేసినా, శ్యాంబాబు మాత్రం స్వతంత్ర అభ్యర్థిగానే బరిలోకి దిగారు. పోటీ చేసిన ప్రతిసారీ ఓడిపోవడం ఆయనకు అలవాటుగా మారింది. ఇప్పటికి 30సార్లు ఆయన ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ ఏమాత్రం వెరవని ఆయన ఈసారి కూడా మళ్లీ బరిలోకి దిగారు. ఏదో ఒకరోజు ప్రజలు తనను గెలిపిస్తారని ఆయన నమ్ముతున్నారు. అదెప్పుడో కాదని, ఈసారే గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆస్కా, బెర్హంపూర్ (బరంపురం) లోక్‌సభ స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగుతున్నారు. విశేషం ఏమిటంటే.. దిగ్గజాలు అయిన పీవీ నరసింహారావు, బిజు పట్నాయక్‌ల మీద కూడా ఆయన పోటీ చేయడం. ప్రస్తుతం ఎన్నికలు బాగా మారిపోయాయని, డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్రారెడ్డి గెలవాలంటూ అల్లు అర్జున్ శుభాకాంక్షలు

- శిల్పాను మిత్రుడిగా పేర్కొన్న బన్నీ
- పార్టీ వేరైనా మిత్రధర్మంతో అభినందనలు చెబుతున్నట్టు వెల్లడి



**రాజధాని వార్తలు :** టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ నిన్న జనసేనాని పవన్ కల్యాణ్, నరసాపురం ఎంపీ అభ్యర్థి నాగబాబులకు బహిరంగ మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ట్విట్టర్ లో లేఖ రాశారు. అయితే, నేడు కూడా బన్నీ మరో లేఖ రాయగా, అది తన మిత్రుడు శిల్పా రవిచంద్రారెడ్డి కోసం కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. శిల్పా వైసీపీ నేత కావడంతో దీనిపై అందరి దృష్టి పడింది. శిల్పా రవిచంద్రారెడ్డి నంద్యాల నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

శిల్పా రవిరెడ్డి తన రాజకీయ ప్రస్థానం ఆరంభిస్తున్న ఈ తరుణంలో శుభాకాంక్షలు చెబుతున్నట్టు అల్లు అర్జున్ తన లేఖలో తెలిపారు. శిల్పాను బన్నీ తన సన్నిహిత మిత్రుడిగా పేర్కొన్నారు. చాలా సంవత్సరాలుగా తనకు మంచి స్నేహితుడిగా ఉన్నాడని, జెంటిల్మన్ అని వివరించాడు. అయితే, రాజకీయ పార్టీల పరంగా చూస్తే, తాము వేర్వేరు పార్టీలకు చెందినవాళ్లమని, తమ రాజకీయ భావజాలం కూడా పూర్తి భిన్నమని, కానీ స్నేహం కోసం తన మిత్రుడికి హార్దిక శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు బన్నీ వివరణ ఇచ్చారు.

## 'నోట్ల రద్దు'తో తగ్గిన పన్ను చెల్లింపుదారులు

**రాజధాని వార్తలు, న్యూఢిల్లీ :** ప్రధాని మోడీ పాలన వైఫల్యాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఆర్థిక వ్యవస్థకు చేటు తెచ్చిన మరో విధానమే నోట్ల రద్దు. పేదలు, సామాన్యుల జీవితాలను రోడ్డుకీడ్చిన కేంద్ర ప్రభుత్వ దారుణ విధాన నిర్ణయం. నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను కుదేలయ్యేలా చేసింది. పన్నుల వ్యవస్థను పతనంలోకి నెట్టింది. నోట్ల రద్దు చేపట్టిన సంవత్సరంలో 88 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు రిటర్నులు దాఖలు చేయలేదని వెల్లడయ్యింది. రూ.500, రూ.1,000 నోట్ల రద్దు నేపథ్యంలో ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోవడంతో ఆదాయం పడిపోవడం లేదా ఉద్యోగాలు కోల్పోవడం వంటి తీవ్ర సామాజిక అనర్థాలు సంభవించాయి. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 1.06 కోట్ల కొత్త పన్ను చెల్లింపుదారులు చేరారు. మునుపటి సంవత్సరంకంటే ఈ సంఖ్య దాదాపు 25 శాతం ఎక్కువ. అదే ఏడాది ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య భారీగా పెరిగింది. నాలుగేళ్ల కాలానికి ఇది భిన్నంగా ఉంది. ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయని వారి సంఖ్య 2015-16లో 8.56 లక్షల నుంచి 2016-17లో 88.04 లక్షలకు పదింతలు పెరిగింది. 2000-01 నాటి నుంచి సుమారు రెండు దశాబ్దాల్లో ఇదే అత్యధికమని ఆదాయపు పన్ను విభాగం అధికారులు తెలిపారు. రిటర్నులు దాఖలు చేసే వారి సంఖ్య 2013 ఆర్థిక సంవత్సరంలో 37.54 లక్షల నుంచి 2014లో 27.02 లక్షలకు క్రమంగా తగ్గుతూ వచ్చింది. 2016 ఆర్థిక సంవత్సరంలో 16.32 లక్షలు ఉండగా, 2016 ఆర్థిక ఏడాదిలో 8.56 లక్షలుగా ఆ సంఖ్య ఉంది. నోట్ల రద్దు ఫలితంగా ఉద్యోగాలు కోల్పోవడం, ఆదాయం నష్టపోవడం వంటివి ఈ పరిస్థితికి దారి తీశాయి. నోట్ల రద్దు అరాచక నిర్ణయం 2016-17 జాతీయ స్థూల ఉత్పత్తి(జీడీపీ)పై తీవ్ర ప్రభావం చూపింది. వాస్తవంగా 7.1 శాతంగా అంచనా వేయగా, ఈ ఏడాది జనవరి ముగిసే నాటికి 8.2 శాతానికి సవరించబడింది.

## చేతికి సెలైన్ సూదితోనే ప్రచారం

**తెనాలి చేరుకున్న జనసేనాని**



**రాజధాని వార్తలు, తెనాలి :** జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అస్వస్థత నుంచి కోలుకుని మళ్లీ ఎన్నికల ప్రచారం బాటపట్టారు. వడదెబ్బ కారణంగా శనివారం పగలంతా విశ్రాంతి తీసుకున్న పవన్ సాయంత్రం తెనాలి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నేత నాదెండ్ల మనోహర్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచారం కోసం వచ్చిన పవన్ కల్యాణ్ చేతికి సెలైన్ ఎక్కించే సూది అలాగే ఉంది. దాన్నిబట్టి ఆయన చికిత్స మధ్యలోనే ప్రచారానికి వచ్చినట్టు అర్థమవుతోంది. ఎన్నికల ప్రచారం మరికొన్నిరోజుల్లో ముగియనుండడంతో అభ్యర్థుల కోసం ఆయన అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా వచ్చినట్టు తెలుస్తోంది. తెనాలిలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ నాయకుల్లా భూములు ఆక్రమించుకునేందుకు తాను రాజకీయాల్లోకి రాలేదని స్పష్టం చేశారు. తమ పార్టీ నేతలు కూడా భూకబ్జాలు చేసేందుకు రాలేదని అన్నారు. తాము ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసేందుకు వచ్చామని, అదే సమయంలో వ్యవస్థలను దెబ్బతీస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తాను పైకి ఎంత మెత్తగా కనిపిస్తానో, ప్రజలకు నష్టం జరుగుతుంటే మాత్రం అంతే కటువుగా వ్యవహరిస్తానని అన్నారు. జనసేన అన్ని కులాలకు సమప్రాధాన్యత ఇస్తుందని, కులాల ఐక్యతకు పాటుపడతామని పవన్ కల్యాణ్ తెలిపారు. రాజకీయ నాయకులకు కులం, మతం, ప్రాంతం ఉండకూడదని భావిస్తానని పేర్కొన్నారు.

## 'ఆంధ్రజ్యోతి' రాధాకృష్ణా.. నువ్వో చీడపురుగువి

**విజయసాయిరెడ్డి ఫైర్**



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** వైసీపీ ముఖ్యనేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి 'ఆంధ్రజ్యోతి' రాధాకృష్ణపై నిప్పులు చెరిగారు. తనపై ఆంధ్రజ్యోతిలో అసత్య కథనాలు ప్రసారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇవాళ విజయసాయి ఆడియో టేపులంటూ కొన్ని క్లిప్పింగ్స్ మీడియాలో విశేషంగా ప్రసారమయ్యాయి. దీనిపై విజయసాయి తీవ్రస్థాయిలో స్పందించారు. ఆ ఆడియో టేపులో ఉన్నది తన వాయిస్ కాదని స్పష్టం చేశారు. తన గొంతు అందరికీ తెలుసని అన్నారు. "ఆ ఆడియో టేపులో మా పార్టీ అధ్యక్షుడ్ని నేను కించపరిచేలా మాట్లాడుతున్నానంటూ ఏబీఎన్ చానల్ తప్పుగా ప్రచారం చేసింది. రాధాకృష్ణ నిజమైన పాత్రికేయుడు అయితే ఆడియో టేపులో ఉన్నది నా వాయిసే అని నిరూపించాలి. లక్ష్మీపార్వతిపైనా ఇలాగే దుష్ప్రచారం చేశారు. నువ్వు సమాజానికి ఏమాత్రం ఉపయోగపడని వ్యక్తివి. చీడపురుగువి. చంద్రబాబుతో కలిసి నువ్వు దోచుకున్న సొమ్మును ప్రతి పైసా కక్కిస్తాం. రాధాకృష్ణపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం. హైదరాబాద్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తాం. అసత్య ప్రచారాలు చేస్తున్న ఆ చానల్ మూతపడాల్సిందే!" అంటూ విజయసాయిరెడ్డి ఎంతో ఆవేశంతో మాట్లాడారు.

## నరసాపురం లోక్ సభ

## వైసీపీ అభ్యర్థి కారుపై రాళ్ల దాడి

- రఘురామ కృష్ణంరాజుకు తప్పిన ముప్పు
- వెంటనే స్పందించిన భద్రతా సిబ్బంది
- జనసేన కార్యకర్తల పనే అంటున్న వైసీపీ



**రాజధాని వార్తలు, పశ్చిమగోదావరి :** పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లోక్ సభ స్థానానికి పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి రఘురామ కృష్ణంరాజుకు కాస్తలో ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారుపై కొందరు వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం గ్రామంలో ఈ ఘటన జరిగింది. కాళీపట్నంలో జనసేన సభ జరుగుతున్న సమయంలో రఘురామ కృష్ణంరాజు కాన్వాయ్ అటుగా వెళుతుండగా ఈ దాడి జరిగింది. దుండగులు ఆయన కారునే కాకుండా మరో కారును కూడా లక్ష్యంగా చేసుకుని రాళ్ల వర్షం కురిపించారు. ఈ దాడిలో రఘురామ కృష్ణంరాజు కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ తరుణంలో సెక్యూరిటీ సిబ్బంది రావడంతో ఆ వ్యక్తులు నిదానించారు.

రఘురామ కృష్ణంరాజుపై దాడి జరిగిందని తెలియగానే వైసీపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాళీపట్నం చేరుకున్నారు. జనసేన కార్యకర్తలే తమ నేతపై దాడికి పాల్పడ్డారంటూ వైసీపీ కార్యకర్తలు ఆరోపించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అయితే పోలీసులు వెంటనే స్పందించి ఇరు వర్గాలను చెదరగొట్టడంతో అక్కడ సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాయి. నరసాపురం నియోజకవర్గంలో వైసీపీ తరఫున రఘురామకృష్ణంరాజు పోటీచేస్తుండగా, జనసేన నుంచి మెగాబ్రదర్ నాగబాబు బరిలో ఉన్నారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ లోక్ సభ స్థానంపై ఆసక్తి ఏర్పడింది.

## భర్త గెలుపు కోసం జనంలోకి హీరో సోదరి !



**రాజధాని వార్తలు, పెదనందిపాడు :** రాష్ట్రాభివృద్ధి చేసిన టీడీపీని ఆదరించాలని హీరో మహేష్ బాబు సోదరి, ఎంపీ అభ్యర్థి గల్లా జయదేవ్ భార్య పద్మావతి అన్నారు. మండల పరిధిలోని గోగులమూడి, రావిపాడులో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని, ప్రతిపక్షానికి ఓటు వేస్తే దుర్భిక్షం తప్పదన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రతిపక్ష నాయకులకు, వారికి తోడ్పాటునందిస్తున్న నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. భావితరాల భవిష్యత్ కోసం జరగనున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలన్నారు. రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో నదుల అనుసంధానం ద్వారా తాగు, సాగునీరు అందిస్తున్న ఘనత ఒక్క తెలుగుదేశం పార్టీకే దక్కిందన్నారు. అనంతరం ప్రచార రథంపై గ్రామంలో వీధివీధిన తిరుగుతున్న ప్రజలకు అభివాదం చేస్తూ 11న జరగనున్న ఎన్నికల్లో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గల్లా జయదేవ్, డొక్కా మాణిక్యవరప్రసాద్‌లకు తమ అమూల్యమైన ఓటును వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## జగన్ సీఎం కావడం ఖాయం..

**మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ**



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధాని పదవికి అన్నివిధాలా అర్హుడని మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ సారి కేంద్రంలో కాంగ్రెస్, బీజేపీయేతర ప్రభుత్వం ఏర్పాటు కాబోతోందని జోస్యం చెప్పారు. కొద్దిరోజుల్లోనే మోదీ మాజీ ప్రధాని కాబోతున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. హైదరాబాద్ లో ఓ టీవీ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒవైసీ పలు అంశాలపై ముచ్చటించారు. ఆంధ్రప్రదేశ్ లో జగన్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఒవైసీ పునరుద్ఘాటించారు. ఏపీ సీఎం చంద్రబాబుకు రాజకీయ నిబద్ధత లేదని స్పష్టం చేశారు. గోద్రా అల్లర్ల సమయంలో బీజేపీకి టీడీపీ మిత్రపక్షంగానే కొనసాగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇన్నేళ్లు ముస్లిం వర్గాన్ని దూరం పెట్టిన బాబు ఇప్పుడు డిప్యూటీ సీఎం పదవి ఇస్తానని కొత్త రాగం అందుకున్నారని దుయ్యబట్టారు. ఏపీ ప్రజలు చంద్రబాబును నమ్మడం లేదని ఒవైసీ తేల్చిచెప్పారు. **ఏపీకి ప్రత్యేకహోదా విషయంలో మజ్లిస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఒవైసీ తెలిపారు.** హోదా సాధించేందుకు జగన్‌కు భారీ మెజారిటీతో గెలుపును కట్టబెట్టాలని ఏపీ ప్రజలకు పిలుపునిచ్చారు.

## అమెరికాలో తెలుగమ్మాయి అనుమానాస్పద స్థితిలో మృతి



**రాజధాని వార్తలు, హైదరాబాద్ :** ఇటీవలే తెలంగాణ యాదాద్రి జిల్లాకు చెందిన ఓ యువకుడు అమెరికాలో మృతి చెందిన ఘటన మరువకముందే ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మరణించడం తీవ్ర కలకలం రేపుతోంది. మహబూబాబాద్ జిల్లా చింతలపల్లి గ్రామానికి చెందిన సంధ్య అనే యువతి పెళ్లి చేసుకుని భర్తతో కలిసి అమెరికా వెళ్లింది. ఆమె భర్త శ్రీకాంత్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పనిచేస్తూ టెక్సాస్ లో ఉంటున్నాడు. పెళ్లయిన తర్వాత శ్రీకాంత్ అదనపు కట్నం కోసం సంధ్యను వేధిస్తున్నట్టు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో, సంధ్య ఆత్మహత్యకు పాల్పడిందని శ్రీకాంత్ భారత్ లో ఉన్న ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. గొంతు కోసుకుని బలవన్మరణం చెందిందని తెలిపాడు. దాంతో సంధ్య తండ్రి మహేందర్ తొర్రూరు పోలీస్ స్టేషన్ లో దీనిపై ఫిర్యాదు చేశారు. మహేందర్ కు ముగ్గురు కుమార్తెలు కాగా, వారిలో సంధ్య చిన్న కుమార్తె. సమీప బంధువు అయిన శ్రీకాంత్ కు ఇచ్చి వివాహం చేశారు.

## మదనపల్లె టూటౌన్ సీఐపై ఈసీ వేటు

- టీడీపీ ప్రచారసభలో కోడ్ ఉల్లంఘన జరిగినా కేసు పెట్టలేదు
- అందుకే తొలిగించామన్న ఈసీ
- కొత్త సీఐ నియామకం కోసం డీఐజీకి ఆదేశాలు




**రాజధాని వార్తలు,మదనపల్లె :** మరికొన్నిరోజుల్లో పోలింగ్ జరగనున్న తరుణంలో ఏపీలో అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. ఇప్పటివరకు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన ఎన్నికల సంఘం ఇప్పుడు దిగువస్థాయి అధికారులపైనా చర్యలకు ఉపక్రమించింది. తాజాగా, ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించలేదంటూ మదనపల్లె టూటౌన్ సీఐ సురేష్ కుమార్ పై బదిలీ వేటు వేసింది. సురేష్ కుమార్ ను విధుల నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో మరో సీఐ కోసం మూడు పేర్లు సూచించాలంటూ ఎన్నికల సంఘం డీఐజీని ఆదేశించింది. తెలుగుదేశం పార్టీ ప్రచారం సందర్భంగా ఎన్నికల నియమావళికి భంగం కలిగిందని ఎన్నికల పరిశీలకుడు నవీన్ కుమార్ ఫిర్యాదు చేసినా సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేయలేదంటూ ఆయన తొలగింపునకు ఈసీ కారణం చెప్పింది. సురేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ నవీన్ కుమార్ తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపింది.

# నువ్వా .. నేనా!

## అవనిగడ్డ



తెదేపా అభ్యర్థి, మండలి బుద్ధ ప్రసాద్

**బలాలు..**

- మారిన రాజకీయాల్లో కూడా గాంధేయవాది
- మంత్రిగా అనుభవం
- అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిన అనుభవం
- డిప్యూటీ స్పీకర్‌గా రాణింపు



వైకాపా అభ్యర్థి, సింహాద్రి రమేశ్ బాబు

**బలాలు..**

- బలమైన పార్టీ కేడర్
- నియోజకవర్గంలో అన్ని గ్రామాలతో సంబంధం
- అధికారంలో లేకపోయిన ప్రజలతో సాన్నిహిత్యం

## పెడన



వైకాపా అభ్యర్థి, జోగి రమేశ్

**బలాలు..**

- మంచి వ్యక్త
- ప్రజా నాయకుడు
- ఉన్నత విద్యావంతుడు



తెదేపా అభ్యర్థి, కాగిత వెంకట కృష్ణ ప్రసాద్

**బలాలు..**

- నియోజకవర్గంలో పార్టీలో బలంగా ఉండటం
- ప్రభుత్వ పథకాలు అభివృద్ధి పనులు
- స్థానికుడు
- బలమైన సామాజిక వర్గం
- ఎమ్మెల్యేగా అనుభవం

## దెందులూరు



వైకాపా అభ్యర్థి, కొఠారు అబ్బాయచౌదరి

**బలాలు..**

- ఉన్నత విద్యావంతుడు
- అంతర్జాతీయ ఉద్యోగ అనుభవం
- అవినీతి ఆరోపణలు లేకపోవడం
- బలమైన పార్టీ కేడర్



తెదేపా అభ్యర్థి, చింతమనేని ప్రభాకర్

**బలాలు..**

- బలమైన పార్టీ కేడర్
- ప్రభుత్వ పథకాలు అభివృది
- ఎమ్మెల్యేగా అనుభవం

## గన్నవరం



వైకాపా అభ్యర్థి, యార్లగడ్డ వెంకటరావు

**బలాలు..**

- వివిధ దేశాలలో వ్యాపార అనుభవాలు
- బలమైన సామాజిక వర్గం
- పార్టీ సపోర్టు
- బలమైన పార్టీ కేడర్



తెదేపా అభ్యర్థి, వల్లభనేని వంశీ

**బలాలు..**

- ఎమ్మెల్యేగా అనుభవం
- బలమైన సామాజిక వర్గం
- బలమైన పార్టీ కేడర్
- సౌమ్యుడు, స్నేహశీలి
- గన్నవరంను అభివృద్ధి చేయడం

## పెనమలూరు



వైకాపా అభ్యర్థి, కొలుసు పార్థసారథి

**బలాలు..**

- మంత్రిగా రాణింపు
- విద్యాధికుడు
- బలమైన పార్టీ కార్యకర్తలు



తెదేపా అభ్యర్థి, బోడె ప్రసాద్

**బలాలు..**

- ఎమ్మెల్యేగా అనుభవం
- నియోజకవర్గంలో మంచి పేరు
- ప్రజలతో సన్నిహిత సంబంధాలు

## మచిలీపట్నం



వైకాపా అభ్యర్థి, పేర్ని నాని

**బలాలు..**

- బలమైన పార్టీ కార్యకర్తలు
- ఎమ్మెల్యేగా అనుభవం
- స్థానికుడు
- నియోజకవర్గ గ్రామాలతో సన్నిహిత సంబంధాలు



తెదేపా అభ్యర్థి, కొల్లు రవీంద్ర

**బలాలు..**

- ప్రభుత్వ పథకాలు
- మంత్రిగా అనుభవం
- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ
- బందర్ రేవు అభివృద్ధికి కృషి

## హిందూపురం



వైకాపా అభ్యర్థి, ఇక్బాల్

**బలాలు..**

- పోలీస్ ఆఫీస్‌గా గుర్తింపు
- బలమైన సామాజిక వర్గం
- పూర్వ ఎంపీ మద్దతు
- బలమైన పార్టీ కేడర్
- ఉన్నత విద్యావంతుడు



తెదేపా అభ్యర్థి, బాలకృష్ణ

**బలాలు..**

- బలమైన రాజకీయ కుటుంబ నేపథ్యం
- సినీపరిశ్రమలో ఉన్న కుటుంబసభ్యుల నుంచి అన్ని విధాలా సహకారం
- పార్టీకి బలమైన సామాజికవర్గాల మద్దతు
- నియోజకవర్గంలో విస్తృతస్థాయి పరిచయాలు

## రాప్తాడు



వైకాపా అభ్యర్థి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

**బలాలు..**

- బలమైన సామాజిక వర్గం
- బలమైన పార్టీ కార్యకర్తలు
- ఉన్నత విద్యావంతుడు



తెదేపా అభ్యర్థి,పరిటాల శ్రీరామ్

**బలాలు..**

- బలమైన పార్టీ కార్యకర్తలు
- సామాజిక వర్గం మద్దతు
- నియోజకవర్గ అభివృద్ధి పై శ్రద్ధ
- ప్రభుత్వ పథకాల అనుకూలత

## ఆళ్లగడ్డ



వైకాపా అభ్యర్థి, గంగుల బిజేంద్రారెడ్డి

**బలాలు..**

- బలమైన పార్టీ కార్యకర్తలు
- యువ నాయకుడు
- నియోజకవర్గ అభివృద్ధి పై శ్రద్ధ



తెదేపా అభ్యర్థి, భూమా అఖిలప్రియ

**బలాలు..**

- బలమైన సామాజిక వర్గం మద్దతు
- ఎమ్యెల్యే,మంత్రిగా అనుభవం
- బలమైన పార్టీ కేడర్

## హిందూపురం (లోక్‌సభ)



వైకాపా అభ్యర్థి, గోరంట్ల మాధవ్

**బలాలు..**

- పోలీస్ అధికారిగా గుర్తింపు
- బలమైన సామాజిక వర్గ మద్దతు
- ప్రజలతో సన్నిహిత సంబంధాలు
- బలమైన పార్టీ కార్యకర్తలు



తెదేపా అభ్యర్థి, నిమ్మల క్రిష్టప్ప

**బలాలు..**

- ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- పార్టీకి బలమైన నేతలు, క్యాడర్ ఉండటం
- ఫలించిన అసమ్మతి నేతల బుజ్జగింపు ప్రయత్నాలు
- కార్మిక సంఘాలు, ఆర్థికంగా బలమైనవర్గాల మద్దతు కూడగట్టడం

## కర్నూలు (లోక్‌సభ)



వైకాపా అభ్యర్థి, డా. సంజీవ్ కుమార్

**బలాలు..**

- బలమైన పార్టీ కేడర్
- డాక్టర్‌గా ప్రజలతో మంచి సంబంధాలు
- సామాజిక సేవలు ముందజ
- నియోజకవర్గంలో సన్నిహిత సంబంధం



తెదేపా అభ్యర్థి, కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి

**బలాలు..**

- కేంద్రమంత్రిగా అనుభవం
- నియోజకవర్గంలో విస్రుత పరిచయాలు
- దశాబ్దాలు రాజకీయా నేపథ్యం
- ప్రభుత్వ పథకాల అనుకూలత

## విశాఖ పట్టణం (లోక్‌సభ)



తెదేపా అభ్యర్థి, ఎం భరత్

**బలాలు..**

- బలమైన సామాజిక వర్గం
- ప్రభుత్వ పథకాల అనుకూతల
- బలమైన పార్టీ కార్యకర్తలు
- స్థానిక నేపథ్యం
- విద్యావంతుడు



జనసేన అభ్యర్థి, లక్ష్మీనారాయణ

**బలాలు..**

- పోలీస్ అధికారి జేడిగా గుర్తింపు
- బలమైన సామాజిక వర్గం
- నిజాయితీ గల అధికారిగా పేరు
- ప్రజలకు మేలు చేయాలని ఆరాటం

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI APTEL14598,
Email : rajadhanivartalu1@gmail.com